www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 4 ఆగస్టు 2024
5
వైఎస్ఆర్

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించుకుందాం

ప్రజాశక్తి - కడప అర్బన్ : తెలుగునాడు విద్యార్థి సమాఖ్య ముద్రించిన ఓ విద్యార్థి, యువత డ్రగ్స్ రహిత సమాజం కోసం పాటు పడదాం అనే పోస్టర్‌ను శనివారం కడప ఎమ్మెల్యే మాధవి ఆవిష్కరించారు. డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించుకోవడంలో విద్యార్థి, యువత భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో అభివృద్ధిలో భాగస్వాములు కావాల్సిన యువత మాదకద్రవ్యాలకు బానిసలుగా మారడం బాధాకరమన్నారు. చాపకింద నీరులా వ్యాపిస్తున్న డ్రగ్స్‌ను ఎవరికివారు నిర్మూలించుకోవాలన్నారు. సరదాగా మొదలయ్యే ఈ అలవాటు చివరకు బానిసగా మార్చుకుంటుంది. డ్రగ్స్ కోసం అసాంఘిక, అరాచక, హింసాత్మక నేరాలు చేసేందుకు కూడా బాధితులు వెనకాడరని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేష్, ఉపాధ్యక్షుడు ఏటూరి లోకేష్, చేతన్ కుమార్ రెడ్డి, రాజేష్, శివ, ఫరీద్, కార్తీక్ పాల్గొన్నారు.

'కౌలు'కు గుర్తింపేది!

అవగాహన కార్యక్రమాలతో సరి
కార్డుల మంజూరులో వెనకడుగే



కౌలు రైతులు గుర్తింపునకు నోచుకోవడం లేదు. కడప జిల్లాలోని కౌలురైతుల గుర్తింపు కార్డులు మంజూరు ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. సర్వే, రీసర్వే పేరుతో కాలయాపన జరుగుతోంది. ఫలితంగా కౌలురైతులు ఖరీఫ్‌లో పంటల సాగుకు వ్యవసాయ రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్టపరిహారం వంటి సదుపాయాలను కోల్పోవాల్సి వస్తోంది. వ్యవసాయ శాఖ నిర్లక్ష్య వైఖరి కారణంగా వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. రూ.రెండు, రూ.మూడు చొప్పున అప్పులు తీసుకుని వడ్డీ వ్యాపారుల కబంధ హస్తాల్లో చిక్కుకుని తీవ్ర ఆర్థిక అగాధంలో కూరుకుపోతున్న దుస్థితి దాపురించింది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో సుమారు 40 వేల మంది కౌలురైతులు ఉన్నారు. ప్రతి ఏటా సంభవిస్తున్న ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి రైతులు పంటలు సాగు చేస్తున్నారు. ఇటువంటి సమయాల్లో పంట నష్టాలు సంభవించడం పరిపాటి. నష్టాల బారిన పడిన రైతులకు నష్టపరిహారం అందించాలంటే కౌలురైతులకు గుర్తింపు కార్డులు తప్పనిసరి. వీటిని క్రాప్ కల్టివేషన్ రైట్ కార్డులు (సిసిఆర్‌సికార్డు) అంటారు. వీటి ఆధారంగానే ప్రభుత్వపరమైన సహాయం పొందడానికి అవకాశం ఉంటుంది. మార్కెట్లలో వ్యవసాయ ఉత్పత్తులను క్రయవిక్రయాలకు సిసిఆర్‌సి కార్డులు అవసరం ఉంటుంది.

ఇటువంటి కీలక కార్డుల పంపిణీ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. ఇప్పటికే వర్షాభావంతో రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. పంట నష్టపరిహారం పొందడానికి సిసిఆర్‌సి కార్డుల ద్వారానే సాధ్యం పడుతుంది.

నత్తనడకన సర్వే...రీసర్వేలు

జిల్లా వ్యాప్తంగా 10 వేల మందికి సిసిఆర్‌సి కార్డులు మంజూరు చేయడం జిల్లా వ్యవసాయ శాఖ లక్ష్యం. ఏప్రిల్ నుంచి జులై నెలాఖరు నాటికి సర్వే, రీసర్వేల పేరుతో ఏడు వేల మందికి కార్డులు మంజూరు చేసినట్లు తెలుస్తోంది. జిల్లాలోని 36 మండలాల్లో 735 గ్రామాల్లోని కౌలురైతులు ఉన్నట్లు గుర్తించింది. ఈమేరకు కౌలురైతుల గుర్తింపునకు సర్వే చేసింది. అనంతరం 1,753 మందికి ఎలిపిఎం కార్డులను మంజూరు చేసింది. వీటిని మరోసారి రీసర్వే చేసిన అనంతరం 5,392 కార్డులను పంపిణీ చేసింది. 7,145 మందికి సిసిఆర్‌సి కార్డులు మంజూరు చేసినట్లు రికార్డులు పేర్కొంటున్నాయి. ప్రభుత్వాలు శ్రద్ధ కొరవడిన నేపథ్యంలో సిసిఆర్‌సి కార్డుల మంజూరు ప్రక్రియ నత్తనడకన సాగుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

సకాలంలో సిసిఆర్‌సి కార్డులు ఇవ్వాలి

కౌలురైతులకు సకాలంలో గుర్తింపు కార్డులు ఇవ్వాలి. జిల్లా వ్యవసాయ శాఖ నిర్లక్ష్యం కారణంగా మూడు వందల మంది కౌలు రైతులు నష్టపోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఎరువులు, పురుగు మందులు, పంట నష్టపరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ తదితర అవకాశాలను కోల్పోవాల్సిన దుస్థితి దాపురించింది.

జి.వెంకటసుబ్బయ్య, కౌలురైతుల సంఘం జిల్లా అధ్యక్షులు. కడప.

భూమిని పేదలకు పంచాలి

వ్య.కా.స రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు డిమాండ్

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వానికి చెందిన లక్ష ఎకరాల భూమిని రాజకీయ పలుకుబడి కలిగిన వివిధప్రాంతాలకు చెందిన బడానాయకులు ఆక్రమించుకుని ఉన్నారని, తక్షణమే వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శనివారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గత ప్రభుత్వంలో పెద్ద ఎత్తున భూఆక్రమణలు జరిగాయని, వాటిపైనిరి అధికారంలోకి రాగానే స్వాధీనం చేసుకుంటామని తెలుగుదేశం నాయకులు ప్రకటించారని తెలిపారు. అందులో భాగంగానే ఈ నెల 4, 5వ తేదీలలో కలెక్టర్లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారని దీని తర్వాత ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. కోనేరు రంగారావు భూకమిటీ సిఫార్సులు చేసినట్లు రాష్ట్రంలో 30 లక్షల ఎకరాల భూములను పేదలకు పంచడానికి అనుకూలంగా ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన అనంతరం రాష్ట్రంలో ఒక్క ఎకరా కూడా పేదలకు పంచ లేదని చెప్పారు. తెలుగుదేశం ప్రభుత్వం కానీ, వైసిపి ప్రభుత్వం కానీ రాష్ట్రంలో పేదలకు ఒక్క ఎకరా భూమి పంచలేదని విమర్శించారు. పేదలకు అనుకూలమైన అసైన్‌మెంట్ 9/77 చట్టాన్ని వైసిపి ప్రభుత్వం సవరణలు చేసి పెద్దలకు అనుకూలంగా మార్చిందని తెలిపారు. తక్షణమే వైసిపి సవరించిన చట్టాన్ని ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసి తన చిత్త శుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. 6,7 సంవత్సరాలుగా జిల్లాలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో 25 మండలాల్లో భూ సమస్యలపై పని చేస్తున్నాం, వేల ఎకరాల భూమిని భూపోరాటం ద్వారా పేదలకు స్వాధీనం చేసినందని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం భూ ఆక్రమణ దారుల చేతుల్లోని భూమిని స్వాధీనం చేసుకుని పేదలకు పంచ కపోతే రాష్ట్రవ్యాప్తంగా భూ ఉద్యమాలు నిర్వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.శివకుమార్,వి.అన్వేష్, ఉపాధ్యక్షులు జి.చంద్ర శేఖర్, వెంకటేష్, వీరయ్య, నరసయ్య, గురయ్య, పోలయ్య, సురేష్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు

భూ కబ్జాదారులను అరెస్టు చేయాలి

ప్రజాశక్తి - బద్వేలు

మున్సిపాలిటీ పరిధిలోని స్థానిక సుందరయ్య కాలనీలో దాదాపు 2500 కుటుంబాలు నివాసం ఉంటున్నాయని, వారికి సి.కొత్తపల్లి పొలంలో గతంలో ఆర్‌డిఒ ఐదు ఎకరాల స్థలానికి శ్మశానం కోసం కేటాయిస్తామని హామీ ఇచ్చారని, ప్రస్తుత ఉన్నటువంటి ఆర్‌డిఒ, బద్వేల్ మండల తహశీల్దార్ డి. ఉదయ్ భాస్కర్‌రాజు తగు చర్యలు తీసుకోవాలని సిపిఎం పట్టణ కార్యదర్శి కె. శ్రీను డిమాండ్ చేశారు. శనివారం బద్వేల్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో తహశీల్దార్, ఆర్‌డిఒ కార్యాలయంలో పనిచేస్తున్న డిప్యూటీ తహశీల్దార్‌కు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి మాట్లాడుతూ బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని సుందరయ్య కాలనీ ఏర్పాటై సుమారు 25 ఏళ్లపైగా అవుతోందని, అక్కడ ఉన్నటువంటి పేదలు, బడుగు, బలహీన వర్గాల వారు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. సుందరయ్య కాలనీకి శ్మశానం కావాలని పలుమార్లు ఆందోళనలు చేయడంతో గతంలో పనిచేసి నటువంటి ఆర్‌డిఒ స్పందించి సి. కొత్తపల్లె పొలంలో ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించారని చెప్పారు. కొందరు భూ కబ్జాదారులు ఆ శ్మశాన స్థలాన్ని ఆక్రమించుకొని సొమ్ము చేసుకుంటున్నారని, వారి పైన క్రిమినల్ కేసులు నమోదు చేసి స్థలం చుట్టూ ఫినిషింగ్ ఏర్పాటు చేయాలని కోరారు.లేకపోతే సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యక్ష ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు ముడియం చిన్ని, ఎస్.కె. మస్తాన్ షరీఫ్, గంగనపల్లి నాగార్జున, రాజగోపాల్, మోక్షమ్మ, ఖైరున్‌బి, రామలక్ష్మమ్మ, మస్తాన్‌బి పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రేపు స్కీమ్ వర్కర్ల ఆందోళన

జయప్రదం చేయాలని సిఐటియు పిలుపు

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలు, ఆశాలు, మధ్యాహ్న భోజనం, ఇతర కార్మికులు, కాంట్రాక్టు ఉద్యోగుల తొలగింపులు, బెదిరింపులను నిరసిస్తూ ఈనెల 5న కడప కలెక్టరేట్ వద్ద, నియోజకవర్గాల్లో సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని, కార్మికులు, ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి మనోహర్ పిలుపునిచ్చారు. శనివారం సిఐటియు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ముద్దనూరు ప్రాజెక్టు కొండాపురం, జమ్మలమడుగు, మైలవరం, వేంపల్లి, మండలాల్లో వెంటనే రాజీనామా చేయాలని కొందరు కింది స్థాయి రాజకీయ నాయకులు ఒత్తిడి చేయడం బాధాకరమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అసెంబ్లీలో ఎవరిని బెదిరించకూడదని ప్రకటించారని గుర్తు చేశారు. అయినప్పటికీ బెదిరించడం అన్యాయమని తెలిపారు. ప్రభుత్వం చేపట్టే పథకాలు స్కీం వర్కర్లు, అంగన్వాడీలు, ఆశాలు, మధ్యాహ్నం భోజనం కార్మికులు, కాంట్రాక్టు ఉద్యోగులు, ప్రజల వద్దకు తీసుకెళ్లడంతో అత్యంత కీలకపాత్ర పోషిస్తున్నారని చెప్పారు. అలాంటి చిన్న ఉద్యోగుల పైన రాజీనామాలు చేయించడం, బెదిరించడం సహేతుకం కాదని పేర్కొన్నారు. రాష్ట్రంలోచ అనంతపురంలో అక్కడక్కడ తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు జోక్యం చేసుకుని బెదిరింపులు, రాజీనామాలను నిలుపుదల చేయించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ఉన్న ప్రజా ప్రతినిధులు ఇలాంటి వాటికి అవకాశం లేకుండా కింది స్థాయిలో ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా తొలగింపులను నిరసిస్తూ సోమవారం కడప కలెక్టరేట్ వద్ద, నియోజకవర్గాల్లో ఆందోళన చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కె. శ్రీనివాసులురెడ్డి, నగర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, నగర అధ్యక్షులు పి. చంద్రారెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్

క్రీడాకారులను ప్రోత్సహించడం అభినందనీయం

ప్రజాశక్తి - కడప అర్బన్

క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించడం అభినందనీయమని జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్ రెడ్డి, సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్ అన్నారు. శనివారం స్థానిక పోలీస్ గ్రౌండ్‌లో ఇండియా మాజీ క్రికెట్ కెప్టెన్ దోని ట్రోఫీ - 2024 పేరుతో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను భూపేష్ రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. టాస్ వేసిన అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ ప్రముఖ క్రికెట్ దిగ్గజం మహేంద్ర సింగ్ ధోని క్రికెట్ రంగంలో భారతదేశాన్ని అత్యంత ఉన్నత స్థాయిలో నిలిపాడని కొనియాడారు. ఆట ఏదైనా గెలుపు ఓటములు సహజమని పేర్కొన్నారు. ప్రతి క్రీడాకారుడు ఓటమిని గుణపాఠంగా తీసుకుని, గెలుపు దిశగా అడుగులు వేయాలని చెప్పారు. కడప నగరంలో క్రీడలకు మౌలిక వసతులు సరిగా లేవనే విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. అలాగే ఈ క్రీడకు స్పాన్సర్‌షిప్ చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో తాను కూడా క్రీడలకు ఏదైనా అవసరమైతే సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో తారీకు అలీ, మన్సూర్ అలీ ఖాన్, ఖాదర్ బాష, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

'మూల' సాహిత్య కృషి ప్రశంసనీయం

ప్రజాశక్తి - కడప అర్బన్

ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి సాహిత్యం, నాటక రంగాలకు చేసిన కృషి ప్రశంసనీయమని శ్రీహరి డిగ్రీ కళాశాలల అధినేత జి.సుబ్బారెడ్డి అన్నారు. మల్లికార్జునరెడ్డి చేసిన సాహిత్య సేవలను కొనియాడుతూ శనివారం శ్రీహరి డిగ్రీ కళాశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ నిరంతరం కళా సేవకు అంకితమైన మల్లికార్జునరెడ్డి యోగివేమన విశ్వవిద్యాలయంలో కూచిపూడి, కర్ణాటక సంగీతం కోర్సులను తీసుకురావడంలో విజయం సాధించారన్నారు. రామాయణం మొదలుకొని ఇప్పటికీ ఆయన 18 పుస్తకాలు రాశారని అన్నారు. కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆచార్యులు ఆర్. రాజేశ్వరమ్మ, శ్రీహరి డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు జయ ప్రకాష్ రెడ్డి, ప్రిన్సిపల్ నరసింహారెడ్డి, న్యాక్ సమన్వయకర్త భాస్కర్,కంప్యూటర్ విభాగం ముక్తార్ పాల్గొన్నారు.

ఆదివాసీ సమస్యలపై చర్చించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రపంచ ఆదివాసి దినోత్సవం రోజు సన్మానాలు, సత్కారాలు కాకుండా వారి సమస్యలపై చర్చించాలని గిరిజన ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు శివశంకర్ కోరారు. శనివారం కడప ఎమ్మెల్యే మాధవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గిరిజన సమస్యలపై స్పందిస్తూ ఉన్నారని తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అధికారులను పిలిపించి గిరిజనులకు అవగాహన కల్పించాలని కోరారు.

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న శివశంకర్

సుగాలిబిడికిలో వైద్య శిబిరం

ప్రజాశక్తి చింతకొమ్మదిన్నె తల్లిపాలు బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యానిస్తుందని సీనియర్ సివిల్ జిల్లా జడ్జి ఎస్. బాబాఫకృద్దీన్ పేర్కొన్నారు. మండలంలోని మద్దిబడుగు పంచాయతీ సుగాలిబిడికి గ్రామంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో గిరిజనులకు వైద్య శిబిరం నిర్వహించారు. గిరిజనులు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. మలేరియా, డెంగీ, టైఫాయిడ్ తదితర రక్త, వినికిడి, బిపి, షుగర్ పరీక్షలు చేశారు. మెడికల్ స్టాల్స్‌ను, న్యూట్రీషన్ స్టాల్స్‌ను ఏర్పాటు చేసి గిరిజనులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన జడ్జి గిరిజన సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బస్సు, నీరు, విద్యుత్, ఆస్పత్రి వంటి సదుపాయాలపై ఆరా తీశారు. ఏమైన సమస్యలుంటే జిల్లా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించాలన్నారు. ప్రభుత్వ పథకాలకు, ఇతర ప్రయోజనాలకు అర్హులకు చేరవేయడంలో జిల్లా న్యాయసేవ సంస్థ ఎప్పుడూ ముందు ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా ఆదివాసి సంక్షేమ శాఖ ఉప సంచాలకులు సరస్వతి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి తోట సుకుమారన్, ఇఒపిఆర్‌డి. శ్రీధర్, ఆదివాసీ సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

నేడు 18 నూతన బస్సులు ప్రారంభం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి : కడప బస్టాడ్ ఆవరణలో 18 నూతన బస్సులను రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదివారం ప్రారంభించనున్నారు మధ్యాహ్నం మూడు గంటలకు నూతన ఆర్‌టిసి బస్సుల ప్రారంభోత్సవానికి హాజరుకానున్నారు. ఇందులో కడప డిపోకు రెండు, బద్వేల్ డిపోకు నాలుగు, పులివెందులకు నాలుగు, జమ్మలమడుగుకు ఆరు, ప్రొద్దుటూరు- 2 బస్సులు కేటాయించారు.

ఘనంగా 'సుగవాసి' పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-ఒంటిమిట్ట : తెలుగుదేశం పార్టీ రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం పుట్టినరోజు వేడుకలు శనివారం ఒంటిమిట్ట మండలంలో ఘనంగా నిర్వహించారు ముందుగా కొత్త మాధవరం మండల మాజీ ఉపాధ్యక్షులు నామాల వెంకటయ్య ఆధ్వర్యంలో సుగవాసి బాలసుబ్రమణ్యం 54 వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. టిడిపి కార్యకర్తలను, నాయకులను కలసి అభినందనలు తెలిపారు. అనంతరం స్థానిక ఏకశిల వద్ద మయూర గార్డెన్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటు చేసిన సంబరాల్లో పాల్గొని కేక్ కట్ చేసి అభిమానులకు, కార్యకర్తలకు పంచారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తహశీల్దార్లు బాధ్యతల స్వీకరణ

బద్వేలు : నెల్లూరు జిల్లా ఏర్పేడు లో విధులు నిర్వహిస్తున్న డి. ఉదయ భాస్కర్ రాజును బద్వేల్ తహశీల్దార్‌గా శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో గోపవరం మండల తహశీల్దార్‌గా విధులు నిర్వహించానని చెప్పారు. బద్వేల్ మండలంలో ప్రభుత్వ భూముల స్థితిగతులపై అవగాహన ఉందని, ఎవరైనా ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. **గోపవరం :** మండల తహశీల్దార్‌గా ఉదయభారతి శనివారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఉదయభారతిని గోపవరం తహశీల్దార్‌గా నియమిస్తూ కలెక్టర్ లోతేటి శివశంకర్ ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

సభ్యత్వ కార్డును ఇస్తున్న జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు

జిల్లా ఖజానా అధికారికి ఎపిఎన్‌జిఒ సభ్యత్వం

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కె.వి.శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి సి.హెచ్. పురుషోతం నాయుడు పిలుపు మేరకు కడప సిటీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు బి. శ్రీనివాసులు కడప జిల్లా ఖజానా అధికారి ఎం.ఎస్. వెంకటేశ్వర్లుకు, ఎటిఒ, ఎస్‌టిఒలు రవిశేఖర్, సుందరరావు, శేషాద్రికి సభ్యత్వం ఇచ్చారు. సంఘము మెంబర్షిప్ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి డి.రవికుమార్ కడప సిటీ అధ్యక్షులు కె.చిన్నయ్య, కార్యదర్శి సైలెశ్వేర్ రెడ్డి, నాగార్జున, నాగిరెడ్డి, పద్మనాభం, వెంకటరమరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు శ్రీనివాసులు మాట్లాడుతూ ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్‌లో ఇంతవరకు నాన్ గేజిటెడ్ ఉద్యోగుల మాత్రమే సభ్యత్వం ఉండేదని, ఇప్పుడు గజిటెడ్ ఉద్యోగులందరిని తమ అసోసియేషన్‌లో చేర్చుకుంటున్నామని పేర్కొన్నారు.

మొక్కలతోనే ఆరోగ్యకరమైన పర్యావరణం

ప్రజాశక్తి - కడప అర్బన్ : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం ద్వారా రాబోయే తరాలకు ఆరోగ్య కరమైన వాతావరణాన్ని అందించ గలమని యోగి వేమన విశ్వవిద్యాలయం విసి ఆచార్య కె. కృష్ణారెడ్డి పేర్కొన్నారు. జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో వన మహోత్సవం నిర్వహించారు. విశ్వవిద్యాలయ విసి ప్రొఫెసర్ క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ వాతావరణ మార్పులకు పరిశ్రమలు వెదజల్లుతున్న కార్బన్ డైఆక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్ మానవాళికి ప్రమాదకరంగా మారిందన్నారు. కాలుష్యాన్ని తగ్గించేందుకు, వర్షాల కోసం విరివిగా మొక్కలు నాటాలన్నారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్. రఘు నాధరెడ్డి మాట్లాడుతూ మాన్సూన్ వనమహోత్సవం విశ్వవిద్యాలయంలో పండుగ వాతావరణం తెచ్చిందన్నారు. విశ్వవిద్యాలయ బొటానికల్ గార్డెన్లో బిళ్లుడు, ఎర్రచందనం, మద్ది, నేరేడు, తెల్లమద్ది రకాలకు సంబంధించి 500 మొక్కలను నాటాలని నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ 2,8 వలంటీర్లు, పిఒలు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

శిశువులకు తల్లి పాలు శ్రేయస్కరం

ప్రజాశక్తి- చెన్నూరు

తల్లిపాలు బిడ్డకు శ్రేయష్కరమని అప్పుడే పుట్టిన పిల్లలకు ఒక గంటలోపు వచ్చే పాలను ఇవ్వడం వల్ల బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి లభిస్తుందని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ గుర్రమ్మ తెలిపారు, తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం చెన్నూరు- 1 తూర్పు హరిజనవాడ అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్ మాట్లాడుతూ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఆగస్టు 1 నుండి 7వ వరకు మండల వ్యాప్తంగా అన్ని అంగన్వాడీ కేంద్రాలలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా ఆమె అంగన్వాడీ కేంద్రంలోని గర్భిణులకు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతను గురించి తెలియజేశారు. కార్యక్రమంలో మహిళా సంరక్షణ కార్యదర్శి చంద్రకళ, ఏఎన్ఎం జ్యోత్స్న, అంగన్వాడీ టీచర్లు,ఆశా వర్కర్‌లు గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

చిత్తూరు, నెల్లూరు జట్ల మ్యాచ్ డ్రా

ప్రజాశక్తి -కడప :చిత్తూరు జట్టుకు చెందిన లోహిత్ లక్ష్మీనారాయణ డబల్ సెంచరీ సెంచరీ చేసి రికార్డు సృష్టించాడు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ అండర్- 19 గ్రూప్ -బి అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో జరిగిన చిత్తూరు, నెల్లూరు జట్ల మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఈ మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో చిత్తూరు జట్టు 190 పరు గులు చేసింది. నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 381 పరుగులు చేసింది. 2 వికెట్ల నష్టానికి 176 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో చివరి రోజు బ్యాటింగ్ ప్రారంభించిన ప్రారంభించిన చిత్తూరు జట్టు వన్ వన్ సెవెన్ పాయింట్ ఫైవ్ ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 530 పరుగులు చేసి డిక్లేర్ ప్రకటించింది. ఆ జట్టులోని లోహిత్ లక్ష్మీనారాయణ అద్భుతంగా బ్యాటింగ్ ప్రదర్శించి 208 పరుగులు(డబల్ సెంచరీ) చేశాడు. గౌతమ్ కృష్ణ అద్భుతంగా బ్యాటింగ్ లో రాణించి 129 పరుగులు (సెంచరీ) చేశాడు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు చివరి రోజు ఆట ముగిసిన సమయానికి 9 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 9 పరుగులు చేసింది. మ్యాచ్ డ్రాగాముగిసింది.



డబుల్ సెంచరీ చేసిన లోహిత్

న్యాయవాదులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి - కడప : న్యాయవాదులందరికీ న్యాయం చేయాలని కడప బార్ అసోసియేషన్ అధ్యక్షులు బొగ్గుల గుర్రప్ప నాయుడు అన్నారు. శనివారం కడప జిల్లా కోర్టులోని బార్ అసోసియేషన్ సమావేశ హాలులో జిల్లాలోని కడప, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, మైదుకూరు, బద్వేలు, సిద్ధవటం, నందలూరు, రాజంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులు, ప్రతినిధులు, న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులకు జరుగుతున్న అన్యాయంపై చర్చించారు. డెత్ ఆఫ్ బెనిఫిట్స్ రూ. 5 లక్షల నుండి రూ. 25 లక్షలకు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్ రూల్‌ను సవరించాలని అన్నారు. సర్టిఫికెట్‌ను ఒకసారి పరిశీలించిన తరువాత మళ్ళీ మళ్ళీ పరిశీలించడం కాలం వృథా అవుతుందన్నారు. ప్రతి న్యాయవాదికి హెల్త్ కార్డ్ ఇన్సూరెన్స్ ప్రీమియం బార్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ నే చెల్లించాలని అన్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రతి న్యాయవాదికి ఇళ్ల స్థలాలు ఇప్పించేందుకు ప్రభుత్వంతో చర్చలు జరపాలని అన్నారు. ఈ డిమాండ్లన్నింటిని నెరవేర్చాలని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశంలో కడప బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శి వై.టి.జె. కెనడి, లైబ్రరీ సెక్రటరీ నాగభూషణం, కోశాధికారి సుబ్బారామయ్య, జాయింట్ సెక్రటరీ రవీంద్రనాథ్‌రెడ్డి, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ ఎన్. చిన్నయ్య, జమ్మలమడుగు బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు సుబ్బారావు, ప్రొద్దుటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు సుదర్శన్ రెడ్డి, ఉపాధ్యక్షులు లక్ష్మీప్రసన్న, బద్వేలు బార్ అసోసియేషన్ అధ్యక్షులు బ్రహ్మానంద రెడ్డి, సిద్ధవటం బార్ అసోసియేషన్ అధ్యక్షులు పి.వి. రత్నం, నందలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏ.వి. సుబ్రహ్మణ్యం, రాజంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులు నసీరుద్దీన్, న్యాయవాదులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గుర్రప్ప నాయుడు

దారుణం

ప్రజా'దృష్టి'

ఇటీవల తెలుగుగంగ ప్రాజెక్టులో భాగమైన ఎస్ఆర్-1 రిజర్వాయర్‌లో పడి ముగ్గురు విద్యార్థులు మృతి చెందిన ఘటన కలిచి వేసింది. ప్రతి ఏటా ఈత సరదా కోసం వెళ్తూ లెక్కించదగ్గ సంఖ్యలో యువకులు మృత్యువాత పడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఇటువంటి ప్రమాద ఘటనల నివారణకు నీటిపారుదల శాఖ, పోలీస్, రెవెన్యూ యంత్రాంగాలు ప్రమాదాల నివారణ చర్యలు తీసుకోవాలి. ఉమ్మడి కడప జిల్లాలోని 1200 చెరువులు, 16 రిజర్వాయర్లు, ఆరు నదీ పరీవాహక ప్రాంతాలు, పదుల సంఖ్యలో వాగులు, వంకలు, మడుగులు ఉన్న ప్రాంతాల్లో హెచ్చరికల బోర్డులను, ఫెన్సింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేయడం, ఇటువంటి ప్రమాదకర చెరువులు, రిజర్వాయర్లు, మడుగుల ప్రాంతాల్లో నిఘా ఉంచడం వంటి చర్యల ద్వారా నివారించడానికి గల అవకాశాలను పరిశీలించాల్సిన అవసరం ఉంది. జాగ్రత్తలు తీసుకోని పక్షంలో తెలుగుగంగ రిజర్వాయర్‌లో ఈత సరదా కోసం వెళ్లిన ముగ్గురు యువకులు మృత్యువాత పడడం ఆందోళన కలిగిస్తోంది. తెలుగుగంగ ప్రాజెక్టు పరిధిని చెరువులు సహా పుష్పగిరి, హత్యరాల వంటి పుణ్యక్షేత్రాల సమీక్షంలోని వాగు, కూరుకుని పోయే బురద ప్రదేశాలను గుర్తించి ప్రమాద హెచ్చరికల బోర్డులను ఏర్పాటు చేయాలి. రాబోయే వర్షా కాలంలో వాగులు, వంకలు, చెరువులు, మడుగుల జలకళను సంతరించుకునే అవకాశాలు పుష్కలం. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో జలవనరులశాఖ యంత్రాంగం గట్టిచర్యలు తీసుకోవాలి. ఇప్పటి వరకు అటువంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. తుఫానుల సమయాల్లో వరదలు పోటెత్తిన సమయాల్లో మాత్రమే పోలీసులు వంకలు, వరదల ప్రాంతాల్లో నిఘా ఉంచడం మినహా మిగిలిన సమయాల్లో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవడం లేదు. రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల తరహాలో జలప్రమాదాల నివారణను సైతం సీరియస్‌గా తీసుకోవాలి. లేనిపక్షంలో చేతికి అందిన యువకులను చేతులారా కోల్పోవాల్సి రావడాన్ని విధికి వదిలేసి, నిమ్మకుండి పోవడం సరికాదని గ్రహించాలి. కనీస ప్రయత్నాలను చేయడాన్ని వదిలేసి, ఏటా చేతికి అందిన యువకులను గంగపాల్జేయడం క్షంతవ్యం కాదు. సదరు బాధిత కుటుంబంలోని యువకుల మృతి ఘటన వృద్ధులు, తల్లిదండ్రులు పీల్చే తుదిశ్వాస వరకు బాధిస్తూనే ఉంటుందని గ్రహించాలి. ఇటువంటి దురవస్థల బారిన పడిన తల్లిదండ్రుల గర్భశోకాన్ని రూపుమాపడానికి జిల్లా అధికార యంత్రాంగం మానవ ప్రయత్నం చేయాలి. భద్రాచలం రామాలయ సమీపంలోని గోదావరి నదిలో ఏర్పాటు చేసిన హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయడం, ఫెన్సింగ్ వంటి నిఘా వ్యవస్థలను ఏర్పాటు చేసిన తరహాలో రక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందనడంలో సందేహం లేదు.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

తహశీల్దార్‌ను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

భూ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - ఖాజీపేట

భూ సమస్యలపై ప్రత్యేకదృష్టి పెట్టి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని మండల టిడిపి నాయకులు కొత్తగా బాధ్యతలు చేపట్టిన తహశీల్దార్ సరస్వతిని కోరారు. ఆ మేరకు శనివారం వారు రెవెన్యూ కార్యాలయంలో ఆమెకు పుష్పగుచ్ఛమిచ్చి, ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి మండలం అధ్యక్షులు తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి, మండలం పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు బొగ్గుల చంద్రఓబుల్‌రెడ్డి, త్రిపురవరం హరినాథ్‌రెడ్డి, దుంపలగట్టు రవీంద్రరెడ్డి, చెన్నముక్కపల్లె వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

నైతిక విలువలు పెంపొందించడమే లక్ష్యం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించడమే మానవత స్వచ్ఛంద సంస్థ లక్ష్యమని, ఆ మేరకు పనిచేస్తున్నామని స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు పేర్కొన్నారు. శనివారం ఉదయం నల్లపురెడ్డి పల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నైతిక విలువలు పెంపొందించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత ప్రపంచంలో విద్యార్థులకు విలువతో కూడిన విద్య అవసరమన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పిల్లలకు విలువతోకూడిన భవిష్యత్తు ఇవ్వాలన్నారు. సమాజంలో ఎవరితో ఏ విధంగా ప్రవర్తించాలి.. ఎలా మెలగాలి అనే వాటి గురించి వివరించారు. మానవత నిర్వాహకులు విద్యార్థులకు నేటి సమాజంలోని విలువల గురించి వివరించడమే కాకుండా వీటికి సమాధానాలు అందించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు చైర్మన్ కొండారెడ్డి, ప్రెసిడెంట్ జయరాజు, సెక్రటరీ గంగిరెడ్డి, కన్వీనర్ బివి కృష్ణారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ విశ్వనాథ్‌రెడ్డి, జనరల్ సెక్రెటరీ చంద్రశేఖర్‌రెడ్డి, ప్రిన్సిపల్ కమలనాథ శర్మ, శ్రీనివాసరెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సమక్షంలో టిడిపిలో చేరిన వైసిపి కౌన్సిలర్లు

టిడిపిలోకి వైసిపి కౌన్సిలర్ల చేరిక

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు మున్సిపల్ కౌన్సిలర్లు టిడిపిలోకి వలస వెళుతున్నారు. శుక్రవారం నలుగురు వైసిపి కౌన్సిలర్లు టిడిపి తీర్థం పుచ్చుకోగా.. శనివారం ఉదయం మరో ముగ్గురు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ఇంటి వద్దకు వెళ్లి టిడిపి కండువా వేసుకున్నారు. వీరిని ఎమ్మెల్యే సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. టిడిపి గూటికి చేరిన వారిలో 21వ వార్డుకు చెందిన కొవ్వూరు స్వాతి, 16వ వార్డుకు చెందిన మోపూరి రేవతి, 36 వార్డుకు చెందిన అలవలపాటి అరుణ ఉన్నారు. శుక్రవారం రాత్రి వైసిపి నుంచి నలుగురు కౌన్సిలర్లు టిడిపి తీర్థం పుచ్చుకోవడంతో ఇక్కడి వైసిపి నాయకత్వానికి భారీ షాక్ తగిలింది. మొత్తం 41 మంది కౌన్సిలర్లు ఉన్నారు. టిడిపి మేనిఫెస్టోలో పొందుపరిచిన సూపర్ సిక్స్ పథకాలు నచ్చి వార్డు అభివృద్ధి కోసం టిడిపిలో చేరుతున్నట్లు 8వ వార్డ్ కౌన్సిలర్ రాగుల శాంతి, 40వ వార్డు కౌన్సిలర్ రావులకొల్లు అరుణ, 29వ వార్డు కౌన్సిలర్ జయలక్ష్మి, 24వ వార్డు కౌన్సిలర్ కమల్ బాషా తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు సీఎం సురేష్ నాయుడు, వివిఎస్ ముక్తియార్, పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్ మునీర్, నల్లబోతుల నాగరాజు పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణ హర్షణీయం

ప్రజాశక్తి - వేముల

సుప్రీంకోర్టు ఎస్‌సి వర్గీకరణకు పంచజెండా ఊపడం హర్షణీయమని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథిరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా టిడిపి కార్యాలయంలో శనివారం ప్రధాని మోడీ, సిఎం చంద్రబాబు, ఎస్‌సి ఉద్యమనేత మందకృష్ణ మాదిగ చిత్ర పటాలకు ఎస్‌సి నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పేర్ల పార్థసారథిరెడ్డి మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణకు సిఎం చంద్రబాబు గతంలోనే మద్దతు పలికారని తెలిపారు. వర్గీకరణ చేపట్టడంతో మాదిగలకు అన్ని రంగాల్లో న్యాయం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో టిడిపికి చెందిన ఎస్‌సి నాయకులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

మాదిగల జీవితాల్లో వెలుగులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఎస్‌సి వర్గీకరణ మాదిగల జీవితాల్లో వెలుగులు నింపుతుందని ఎమ్మార్పీఎస్ స్పోక్స్ పర్సన్ రామకృష్ణ అన్నారు. శనివారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాల మాదిగ సోదరుల అభివృద్ధికి ఎస్‌సి వర్గీకరణ దోహదపడుతుందని తెలిపారు. సామాజిక అసమానతలు తగ్గించేందుకు అంబేద్కర్ రిజర్వేషన్లు ఏర్పాటు చేశారని తెలిపారు. మందకృష్ణ మాదిగ పోరాట ఫలితంగా సుప్రీంకోర్టు వర్గీకరణకు సంపూర్ణ మద్దతు తెలిపిందన్నారు. సామాజికంగా, ఆర్థికంగా మాదిగలు వెనుకబడి ఉన్నారని ఈ వర్గీకరణతో అభివృద్ధి చెందుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇక రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణ చేసి నోటిఫికేషన్స్ విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలోఎమ్మార్పీఎస్ రామకృష్ణ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి రాజు, మానికింది వెంకటేష్, చిన వెంకటసుబ్బయ్య, దస్తగిరి, గంగరాజు, మేకల ఆంజనేయులు పాల్గొన్నారు.

చేయి తడిపితేనే రుణం మంజూరు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచ్‌లో మేనేజర్‌కు చేయి తడుపుతేనే రుణం (లోన్) మంజూరవుతుందని లబ్ధిదారుడు పి.సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక బ్రాంచ్ దగ్గర శనివారం ప్రజా సంఘాల నాయకులను కలుపుకొని ఆయన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పి.సురేష్ మాట్లాడుతూ ప్రొద్దుటూరు టిబి రోడ్డులోని బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచ్ మేనేజర్ ధైర్యం ముద్ర, ఇతర ప్రభుత్వం ఇచ్చే రుణాలను లబ్ధిదారులకు అన్ని అర్హతలు ఉన్నప్పటికీ.. రుణం ఇవ్వాలంటే ఒక్కో లబ్ధిదారుడు కనీసం 4నుంచి 6నెలలు బ్రాంచ్ చుట్టూ తిప్పుకుని, ఇదేంటి సార్ అని అడిగితే మీ రుణం అమౌంట్ నుంచి 10 శాతం డబ్బులు ఇస్తేనే లోన్ ఇస్తున్నారన్నారు. మేనేజర్ ధైర్యంను తక్షణమే విధుల నుంచి తప్పించి విచారణ జరిపి సివిల్, క్రిమినల్ చర్యలకు సిఫారస్ చేయాలన్నారు. కార్యక్రమంలో జైభీమ్ రావ్ భారత్ పార్టీ స్టేట్ జాయింట్ సెక్రటరీ పల్లె రమేష్, రాయలసీమ పర్యవేక్షణ సంఘం రాష్ట్ర కన్వీనర్ ములపాక ప్రతాప్‌రెడ్డి, ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు గడ్డం నరసింహ, తీట్ల రవికుమార్, పుల్లయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీల హోదాను మార్చాలి

వేంపల్లె : ఆర్జీయూకేటీ పరిధిలోని నాలుగు ట్రిపుల్‌ఐటీల్లో పనిచేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీలకు డిజిగ్నేషన్ మార్చాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కాంట్రాక్ట్ టీచింగ్ ఫ్యాకల్టీ అసోసియేషన్ అధ్యక్షుడు నజీర్ హుస్సేన్ కోరారు. శనివారం కాంట్రాక్ట్ టీచింగ్ ఫ్యాకల్టీ గెస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడలోని సిఎంఒ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి నజీర్ హుస్సేన్ వినతిపత్రం అందజేశారు. 2018 కాంట్రాక్ట్ ఫ్యాకల్టీ నోటిఫికేషన్‌లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ ద్వారా ఇంటర్వ్యూలో సెలెక్ట్ అయినట్లు సిఎంకు చెప్పారు. సెలెక్ట్ అయిన ఫ్యాకల్టీకి గెస్ట్ ఫ్యాకల్టీ అని డిసిగ్నేషన్ ఇవ్వడం జరిగిందన్నారు. ఇందుకు సిఎం సానుకూలంగా స్పందించారని నజీర్ హుస్సేన్ పేర్కొన్నారు.

కుందూ నదిలో పెరిగిన నీటిమట్టం

ప్రజాశక్తి - చాపాడు

రెండు రోజులుగా కుందూ నదిలో నీటిమట్టం పెరిగింది. పది రోజుల క్రితం వరకూ కుందూలో నీరు తక్కువగా ప్రవహించేది. గత వారం రోజులుగా ఎగువ ప్రాంతంలో పడిన వర్షానికి నదిలో నీటి ప్రవాహం పెరిగింది. ప్రస్తుతం కుందూ నదిలో రాజోలి ఆనకట్ట నుంచి 5వేల క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. కుందూ నదికి ఎగువ ప్రాంతాల్లో కురిసిన అధిక వర్షానికి నీటి ప్రవాహం పెరిగింది. కెసి కెనాల్‌కు రాజోలి ఆనకట్ట నుంచి నీటిని విడుదల చేసిన విషయం తెలిసిందే. శ్రీశైలం రిజర్వాయర్ పూర్తిస్థాయిలో నిండడం, ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు వచ్చి చేరుతుండడంతో కింది ప్రాంతాలకు నీటిని వదులుతున్నారు. ప్రస్తుతం నదిలో 5వేల క్యూసెక్కుల వరకు నీరు ప్రవహిస్తోంది. కుందూ నది తీర గ్రామాల్లో రైతులు పంటలు సాగు చేసేందుకు ఏర్పాట్లు చేపడుతున్నారు. కుందూ నది నీటి ఆధారంగా ఇప్పటికే రైతులు పసుపు పంట సాగు చేపట్టారు. వరి నారు సాగు చేపట్టారు. ఇతర పంటలు సాగు చేసే రైతులు ఆ ఏర్పాట్లల్లో ఉన్నారు.

9న రెండవ విడత ప్రవేశాలకు కౌన్సెలింగ్

రెండవ జాబితా సిడి విడుదల చేస్తున్న కన్వీనర్ అమరేంద్ర, డైరెక్టర్

ప్రజాశక్తి - వేంపల్లె

ఆర్జీయూకేటీ పరిధిలోని ట్రిపుల్‌ఐటిలో 2024-25 సంవత్సరానికి సంబంధించి రెండవ విడతలో విద్యార్థులు అడ్మిషన్ పొందేందుకు ఈనెల 9న కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఆడ్మిషన్ కన్వీనర్ అమరేంద్ర కుమార్ తెలిపారు. శనివారం మండలంలోని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి క్యాంపస్‌లో రెండవ విడత విద్యార్థులు జాబితాను అమరేంద్ర కుమార్, ట్రిపుల్ ఐటి డైరెక్టర్ కుమారస్వామి, పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్, క్యాంపస్ డీన్ రత్నకుమారి విడుదల చేశారు. ఈ సందర్భంగా అమరేంద్రకుమార్ విలేకరులతో మాట్లాడుతూ ఆర్జీయూకేటీ పరిధిలోని ట్రిపుల్ ఐటిలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు రెండవ మెరిట్ జాబితాను తయారు చేసి విడుదల చేసినట్లు చెప్పారు. జనరల్ కేటగిరిలో 756 సీట్లకు జాబితాను సిద్ధం చేసి సీట్లు పొందిన విద్యార్థులకు మెసేజ్‌ల ద్వారా సమాచారం పంపినట్లు చెప్పారు. విభిన్న ప్రతిభావంతులు, స్పోర్ట్స్ కోటా కింద జాబితాను వచ్చే వారంలో విడుదల చేయనున్నట్లు తెలిపారు. రెండవ జాబితాలో సీట్లు పొందిన విద్యార్థులు అందరూ తప్పకుండా ఆయా ట్రిపుల్‌ఐటిలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కోరారు. ఆయా క్యాంపస్‌ల్లో అడ్మిషన్లు పొందిన విద్యార్థులు ఈనెల 19,20 తేదీల్లో ట్రిపుల్‌ఐటిల్లో రిపోర్టు చేసుకోవాలని కోరారు. 21 నుంచి ట్రిపుల్ ఐటిల్లో తరగతులు ప్రారంభమవుతాయని వివరించారు. అధ్యాపకులు రోజర్ బిన్ని, అనిల్‌కుమార్‌రెడ్డి, పిఆర్‌ఓ తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

నవజాత శిశువుకు తల్లిపాలే అమృతం

ర్యాలీ చేస్తున్న సిడిపిఒ ముంతాజ్ బేగం

ప్రజాశక్తి - ముద్దనూరు

తల్లిపాలు బిడ్డ ఆరోగ్యానికి, ఎదుగుదలకు, వ్యాధి నిరోధక శక్తికి దోహదపడుతాయని ముద్దనూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒ ముంతాజ్ బేగం పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం సిడిపిఒ ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ కూడలి వరకు తల్లిపాల వారోత్సవాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఉమారాణి, ప్రవీణకుమారి, మహిళా పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం విస్తరణ అధికారి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో యామవరం, చెన్నా రెడ్డిపల్లె అంగన్వాడీ కేంద్రాల్లో శనివారం తల్లిపాల ప్రాముఖ్యత గురించి గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

వేంపల్లె : నవజాత శిశువులకు తల్లిపాలే అమృతమని తాళ్లపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ ఉన్నిసా బేగం పేర్కొన్నారు. మండలంలోని తాళ్లపల్లె అంగన్వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపే ముర్రుపాలు తాగించాలని కోరారు. తల్లిపాలు బిడ్డకు తాగించడం వల్ల అన్ని రకాల పోషక విలువలు పెరగడంతోపాటు వ్యాధి నిరోధక శక్తి కలిగి ఉంటారన్నారు. నిమోనియా, డయేరియా వంటి వ్యాధులు దరిచేరకుండా ఉండేందుకు ముర్రుపాలు ఎంతో తోడ్పాటునిస్తాయన్నారు. శిశువుకు జీర్ణవ్యవస్థ బాగుంటుందని తెలిపారు. రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ రాకుండా నివారిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నాగరత్న, సిహెచ్‌ఒ వెంకటరత్నం, సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, ఎఎన్ఎం అరుణ, జ్యోతి, అంగన్వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

చాపాడు : పుట్టిన బిడ్డకు తల్లిపాలే అమృతమని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శుభరత్నమ్మ తెలిపారు. చాపాడు అంగన్వాడీ కేంద్రం-1లో శనివారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ఎంఇఒలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

మధ్యాహ్న భోజన పథకాన్ని తరచూ పర్యవేక్షించాలి

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు నియోజకవర్గ పరిధిలో మధ్యాహ్న భోజన పథక అమలు తీరును తరచూ పర్యవేక్షిస్తూండాలని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ సూచించారు. అన్ని మండలాల విద్యాశాఖ అధికారులతో శనివారం ఎమ్మెల్యే తన కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తుందన్నారు. నాడు-నేడు పనులలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చాపాడు నూతన హైస్కూల్ భవనాలను త్వరగా ప్రారంభించాలన్నారు. మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలను రాజకీయాలకతీతంగా అధికారులు నిర్వహించాలన్నారు. సమావేశంలో ఎంఇఒలు పద్మలత, నరహరి శర్మ, రవిశంకర్, వంశీకృష్ణ, టిడిపి మండల శాఖ అధ్యక్షులు అన్నవరం సుధాకర్‌రెడ్డి, వెంకట రమణారెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

82 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక

- ట్రిపుల్‌ఐటి డైరెక్టర్ కుమారస్వామి గుప్తా

ప్రజాశక్తి - వేంపల్లె

ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి క్యాంపస్‌లో జరిగిన ఇంటర్వ్యూలో 82 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ట్రిపుల్‌ఐటి డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్ తెలిపారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి క్యాంపస్‌లో శనివారం న్యాక్ టెక్నాలజీ కంపెనీ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎస్‌ఇ, ఇసిఇ, సివిల్, ట్రిపుల్ ఇ, మెకానికల్ ఇంజనీరింగ్ బ్యాచ్‌ల్లో చదివే విద్యార్థులు న్యాక్ టెక్నాలజీ కంపెనీకి 82 మంది ఎంపికైనట్లు తెలిపారు. వీరికి ఏడాదికి రూ.6 లక్షల వరకు జీతం వస్తుందని చెప్పారు. ప్రతి ఏడాది ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి క్యాంపస్‌లో ఆయా కంపెనీలు ద్వారా క్యాంపస్ ఇంటర్వ్యూలు చేపట్టి ఇంజనీరింగ్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు వివరించారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థులను అడ్మిషన్ల కన్వీనర్ అమరేంద్ర కుమార్, డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, పరిపాలనాధికారి డాక్టర్ రవి కుమార్, అకాడమిక్ డీన్ రత్నకుమారి అభినందించారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ అధికారులు వినోద్, సుందర్, రవిబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారం అందించాలి

- జూనియర్ సివిల్ కోర్టు జడ్జి భార్గవి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని జమ్మలమడుగు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి భార్గవి తెలిపారు. శనివారం మండల పరిధిలోని గూడెంచెరువులోని మనోవికాస కేంద్రం, ఎంపిపి స్కూల్‌లో ఆమె మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ముందుగా జడ్జి విద్యార్థులను సమయానికి రోజూ ఆహారం అందిస్తున్నారా అని ఆరా తీశారు. మెనూ ప్రకారం పెడుతున్నారా అని అడిగారు. అనంతరం జడ్జి మాట్లాడుతూ స్వేచ్ఛ హక్కుతోపాటు, ఆహారం పొందే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందన్నారు. చేతులు, పాత్రలు శుభ్రంగా ఉంచుకొని వంట వండాలని సూచించారు. విద్యాహక్కు చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. న్యాయవాది లక్ష్మీ మహేశ్వరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం కోసం మహిళలు పడిగాపులు

- సర్వర్ పనిచేయక కార్డుదారుల అగచాట్లు

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రభుత్వం పంపిణీ చేసే బియ్యం కోసం రేషన్ షాపుల వద్ద మహిళలు పడిగాపులు కాశారు. శనివారం సర్వర్ గంటల కొద్దీ పని చేయలేదు. కార్డుదారులు రేషన్ షాపుల వద్దనే వేచి ఉండాల్సి వచ్చింది. పనులు వదులుకొని బియ్యం కోసం రేషన్ షాపుల వద్దకు వెళితే సర్వర్ పని చేయలేదని డీలర్లు చెప్పడంతో కొందరు కొద్దిసేపు చూసి వెనుదిరిగారు. మరికొందరు సర్వర్ పని చేస్తుందేమో అనే ఆశతో పడి కాపులు కాశారు. డీలర్లు కూడా బియ్యం అయిపోతే తమకు సంబంధం లేద ని చెప్పడంతో కార్డుదారులు అక్కడే ఉన్నారు. తమ కష్టాలను గుర్తించి సర్వ ర్ పనిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కార్డుదారులు కోరుతున్నారు.

డిఎస్‌పిని సన్మానిస్తున్న జగదీష్, మహేశ్వర్‌రెడ్డి, కులాయప్ప

డిఎస్‌పిని కలిసిన జనసేన నాయకులు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల డిఎస్‌పిగా శుక్రవారం బాధ్యతలు చేపట్టిన బి.మురళి నాయక్‌ను జనసేన నేత అలూరు జగదీష్, లింగాల మండలం వేలూరు మహేశ్వర్‌రెడ్డి, కులాయప్ప మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు శనివారం పూల బొకే ఇచ్చి, శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు.

సూపర్ సిక్స్ పథకాలన్నీ అమలు చేయాలి

- పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

ఎన్నికల ముందు టిడిపి ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాల్లో ఒకటి మాత్రమే కూటమి ప్రభుత్వం అమలు చేసిందని, మిగతా అయిదు కూడా వెంటనే అమలు చేయాలని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వాన్ని చూస్తుంటే అప్పుచేసి పప్పుకూడు సినిమాలోని పాట గుర్తుకు వస్తుందని ఎద్దేవా చేశారు.. రాష్ట్రంలో టిడిపి కూటమి పాలన వస్తే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారన్నారు. దాన్ని ప్రజలు నమ్మి ఓట్లు వేశారని తెలిపారు. కానీ అధికారంలోకి వచ్చి 50 రోజులైనా సామాజిక ఫించన్లు పంపిణీ పథకం తప్ప, మిగతావి ఇంకా అమలు చేయడం లేదన్నారు. రాష్ట్ర ఖజానా చూస్తే ఖాళీగా ఉందనే సాకుతో కూటమి ప్రభుత్వం శ్వేతపత్రాల పేరుతో పత్రాలు విడుదల చేసి పలాయన వాదం పాటిస్తున్నట్లు విమర్శించారు. ఖజానా ఖాళీ, రాష్ట్రం అప్పుల కుప్ప అయిన విషయం తెలిసే టిడిపి కూటమి సూపర్ సిక్స్ హామీలు ఇచ్చిందని తెలిపారు. తప్పించుకోవడం కుదరదని హామీలను అమలు చేసి తీరాల్సిందేనని డిమాండ్ చేశారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - ముద్దనూరు

స్థానిక బాలుర ఉన్నత పాఠశాలకు వెళ్లే దారిలో వీధి కుళాయిలకు వారం రోజులుగా తాగునీరు రావడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ముద్దనూరు మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం మహిళలు ఈఓపిఆర్డీ వీర భద్రుడుకు సమస్య విన్నవించారు. తాగునీరు రాక ఇబ్బందులు పడుతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. తమ కూతురు వివాహం ఉందని, నీరు రాకపోతే చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఉపాధ్యాయులు రామసుబ్బమ్మ విన్నవించారు. త్వరగా సమస్యను పరిష్కరించాలని కోరారు.

రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తాం

నీరు సరఫరా చేసే పైపులో చెట్టు వేర్లు చొచ్చుకుపోవడం వల్ల నీటి సరఫరాకు సమస్య ఏర్పడింది. సిబ్బంది మరమ్మతులు చేస్తున్నారు. రెండు రోజుల్లో సమస్య పరిష్కరించి, నీరు సరఫరా చేస్తాం. **- వీరభద్రుడు, ఇఒపిఆర్‌డి**

అవగాహన కల్పిస్తున్న డిఎస్‌పి టి.వెంకటేశులు

ఎర్రచందనం తరలిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - మైదుకూరు

ఎర్రచందనం చెట్లను నరకడం, ఆ దుంగలను అక్రమంగా తరలించడం చట్టరీత్యా నేరమని, తరలించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మైదుకూరు డిఎస్‌పి టి.వెంకటేశులు హెచ్చరించారు. మైదుకూరు సబ్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్‌లలో గతంలో ఎర్రచందనం కేసులలో నిందితులుగా ఉన్న 163 మందికి శనివారం డిఎస్‌పి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎర్రచందనం తరలించడం నేరమన్నారు. గతంలో కేసులో ఉన్నవారు మళ్లీ అలాంటి కార్యకలాపాలకు పాల్పడవద్దన్నారు. ఎర్రచందనం తరలిస్తూ పట్టుపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎర్రచందనం స్మగ్లర్లకు సహాయం అందించడం కూడా నేరమన్నారు. మైదుకూరు పట్టణ సీఐ ఎపి మస్తాన్, డివిజన్ పరిధిలోని ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కార్మిక సంఘం (సిఐటియు) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి చంటి, సాల్మన్ కోరారు. ఆ మేరకు శనివారం వారు మున్సి పల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆప్కాస్ కార్మికులకు బకాయి ఉన్న సమ్మె కాలపు హెల్త్ అలవెన్సులు మంజూరు చేయాలన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొన్నందుకు అదనపు చెల్లింపులు చేయాలన్నారు. ప్రతి ప్రభుత్వ సెలవు దినాన మధ్యాహ్నం నుంచి సెలవు ఇవ్వాలని కోరారు. కార్మికులందరికీ పరికరాలు, బ్లౌజులు, తోపుడు బండ్లు తెప్పించాలని కోరారు. కరోనా కార్మికులకు పెండింగ్ లేకుండా ప్రతినెలా జీతం ఇవ్వడంతోపాటు రూ.3000 జీతం పెంచాలని కోరారు. కొబ్బరి నూనె, సబ్బు లు, యూనిఫాం ఇవ్వాలన్నారు. పార్కుల్లో డివైడర్ వద్ద పని చేస్తున్న నగర దీపికలకు పీఎఫ్, ఈఎస్ఐ కట్ చేయాలన్నారు. ఇందుకు కమిషనర్ రఘునాథ్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని కార్మిక నాయకులు తెలిపారు.

రావులకొలనులో కర్ణాటక పోలీసుల సోదాలు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని రావులకొలను గ్రామంలో కర్ణాటక సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు డిఎస్‌పి స్థాయి అధికారి నేతృత్వంలో సోదాలు నిర్వహించారు. స్థానికుల కథనం మేరకు.. శనివారం గ్రామానికి చెందిన నాగేశ్వర్‌రెడ్డి అనే వ్యక్తిని ఇటీవల కర్ణాటక పోలీసులు పులివెందులలో అరెస్టు చేసినట్లు తెలిసింది. అయితే మరింత సమాచారం కోసం గ్రామంలో సోదాలు నిర్వహించారు. నాగేశ్వర్‌రెడ్డి అనే వ్యక్తి ప్రముఖ వ్యక్తులకు సంబంధించిన కాల్ డేటాను సేకరించి డిటెక్టివ్‌లకు విక్రయించడంతోపాటు మరికొన్ని సైబర్ క్రైమ్ కేసుల్లో సంబంధం ఉండడంతో పూర్తి సమాచార నిమిత్తం గ్రామంలో సోదాలు నిర్వహిస్తున్నారు.

IN THE COURT OF THE 1st Addl.Dist. JUDGE, KADAPA
I.A.No. 27/2023
M.V.O.P.No. 240/2020

Gajjala Rama Subba Reddy. **...Petitioner**

Vs

1. Aluru Alla Basha@Aluru Alla Bakash, S/o Aluru Dasthagiri, Tractor Driver, D.No.2/210, Near Pavan School, Sastri Nagar, Kadapa City and Another. **...Respondents**

NOTICE

పై కేసులో పిటిషనరు తనకు ఆక్సిడెంట్‌లో కలిగిన గాయాలకు గాను నష్టపరిహారము కోరి పై కేసును పై కోర్టులో మీ పైన దాఖలు చేసియున్నారు. సదరు కేసు 7.8.2024వ తేదీన వాయిదాగా వుంటూ వున్నది. కావున పై తేదిన ఉదయం 10.30 గం॥లకు పై కోర్టులో హాజరై మీకేమైన ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపగలరు. లేనంతట మీ పరోక్షముగా తీర్మానించబడును.

//By Order of the Court//
V.ADINARAYANA REDDY
M.CHAKRAPANI RAJU
Advocates,
Kadapa.

Union Bank of India (A Government of India Undertaking)
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
ముండీ బజార్ శాఖ
15-455, హబీబుల్లా స్ట్రీట్, శారదా నిలయం, ముండి బజార్, కడప 516001, సంప్రదించండి: 6302355144

తాకట్టుపెట్టిన బంగారు ఆభరణాల బహిరంగ వేలం కొరకు ప్రకటన

క్రింద పేర్కొన్న వ్యక్తులు రుణాన్ని చెల్లించడంలో విఫలమయ్యారని దీని ద్వారా తెలియజేయడమైనది. అతను పొందిన బంగారు రుణ ఖాతా బకాయిలను క్లియర్ చేయమని రుణగ్రహీత/లను పిలుస్తూ రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా నోటీసులు పంపబడ్డాయి. కావున వారిని బకాయి మొత్తాలను మరియు ఇతర చార్జీలను 22.08.2024న లేదా ముందుగా చెల్లించి తాకట్టుపెట్టిన ఆస్తులను విడిపించుకోవలసిందిగా కోరబడుచున్నది. విఫలం చెందిన ఏద్రైత, సదరు సెక్యూరిటీస్‌ను 23.08.2024వతేది సాయంత్రం 4గం॥లలోపు లేదా ఏదేని ఇతర సౌకర్యవంతమైన తేదీన బ్యాంకు ఆవరణల వద్ద రుణగ్రహీత పూర్తి బాధ్యత పైననే తదుపరి నోటీసు ఇవ్వకుండానే, బ్యాంకు నిర్ణయం మేరకు, బహిరంగ వేలంలో బ్యాంకుచేత విక్రయించబడుతుంది.

క్ర.సం.	లోన్ తేది	లోన్ నంబరు	రుణగ్రహీత పేరు & చిరునామా
1	15/09/2023	175316540001597	శ్రీ. షేక్ ఏజాజ్ అహ్మద్, తండ్రి. షేక్ అక్బర్ బాషా, డో.నం.72/296-10, ఫ్రెండ్స్ కాలనీ, అమర్ హాస్పిటల్ వెనుక, కడప. ఫోన్ : 9985886786
2	15/09/2023	175316540001598	
3	15/09/2023	175316540001599	

తేది: 03.08.2024 బ్రాంచి మేనేజరు

మహారాజశ్రీ కమలాపురం జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
E.P.No.35/2023
O.S.No. 277/2022

నగిరి రామయ్య, S/o జానకి రామయ్య, 64 సం॥లు, హిందూ, R/o.D.No.14/320, Police line, కమలాపురం (M) YSR (Dt). **...పిటిషనర్/D.Hr.**

Vs

కంజుల మాబువల్లి @ మహబూబ్ వల్లి, S/o హుస్సేని, వయస్సు 45 సం॥లు, ముస్లిం, వ్యాపారం, R/o D.No.13/332, బీడీ కాలనీ, కమలాపురం టౌన్, మండలం, YSR (Dt). **...రెస్పాండెంట్/J.Dr**

వేలం నోటీసు

పై నెంబరు EP లోని పిటిషనర్/DHr క్రింద కనబరచిన షెడ్యూల్ దాఖలు ఆస్థిని వేలం వేయించి తన దావా మొత్తం వసూలు చేయించమని పై నెంబరు EP పై రెస్పాండెంట్/JDr పైన దాఖలు చేయగా రాజశ్రీ పై కోర్టు వారు క్రింద కనబరచిన షెడ్యూల్ దాఖలు ఆస్థిని వేలం వేయుటకు 16.08.2024వ తేది ఉ.గం॥ 10.30 ని॥లకు వాయిదా వేసియున్నారు. కావున వేలంలో పాల్గొనదలచిన పై కోర్టులో హాజరయి వేలంలో పాల్గొన వచ్చుని తెలియచేయడమైనది.

SCHEDULE

House bearing Door No.13/332 situated in YSR District, Kamalapuram Sub-District, Kamalapuram Nagara Panchayat, Beedi Colony, Assessment No.1181004564 to an extent of Ac.0.-01 1/4 cents with measurements east-west: 31 feet on northern side, east-west:31 feet on southern side, north-south:14 feet on eastern side, north-south: 21.8 feet on western side bounded as follows.
East: Rastha, West: Rastha, North: House of Kamjula Hussian, South: House of K.Hussian.
Market Value: 11,00,000/-

వాయిదా: 16.08.2024వ తేది ఉ.గం॥ 10.30 ని॥లకు

//By Order of the Court//
ఎస్.మహేశ్వరరెడ్డి
పిటిషనర్/DHr పరం అడ్వకేటు,
కమలాపురం